# గంగులుగాడి పగ

## ఎమ్.వి.వి. సత్యనారాయణ

సాయంకాలం అయిదు గంటలు కొట్టింది కోర్టు గడియారం. ఛీఫ్ జస్టిస్ గడియారంవైపు చూశారు.

నలుగురు ముద్దాయిలు అరుస్తోన్నారు.

ఛీఫ్ జస్టిస్ నిట్టూర్చాడు.

నలుగురు ముద్దాయిలూ చింతపల్లి హత్య కేసులో యావజ్జీవ కారాగారవాసం పొందారు. తాను తీర్పు చెప్పి పది నిముషాలయింది. శిక్ష పడినవాళ్ళు అలాగే అరుస్తారు.

నేరం చేయమని ఎవరు చెప్పారు! శిక్ష అనుభవించమని ఎవరు బాధ పెట్టారు? చింతపల్లి జమీందారు కుటుంబం మొత్తం సభ్యులను చిత్రహింసలు చేసి చంపారు ఈ నలుగురూ.

నలుగురికీ ఉరిశిక్ష వేయవలసింది కొంతలో తప్పింది.

ఛీఫ్ జస్టిస్ తన ఆసనంలోంచి లేచి నిలబడ్డారు.

"ఒకేయ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్!" నలుగురిలోనూ

గంగులు అరిచాడు.

"ఒరేయ్, శాంతారాం! నీ కుటుంబం పనిపడతాంరా. నీకు ముందే హెచ్చరిక చేసాం. ఈ గంగులుగాడి పగ ఎలా వుంటుందో రుచి చూద్దువుగాని!" గంగులు కివుక్కు మన్నాడు.

పోలీసు లాఠీ అతడి డొక్కలో గుచ్చుకుంది. లాఠీ మిలితిరిగింది.

మిగిలిన ముగ్గురు కూడా బూతులు లంకించుకున్నారు.

చీఫ్ జస్టిస్ మెల్లగా వేదిక దిగారు. శాంతారాంను సమీపించారు.

పోలీసులు నేరస్తులను బయటకు యీడ్చుకు వెళ్ళారు.

జ్యూరీ సభ్యులు తెల్లబోయి చూస్తున్నారు.

"మిస్టర్ శాంతారాం! టేకిట్ ఈజీ! ఇలాంటివి మన జీవితాలలో మామూలే! వాళ్ళకు పటిష్టమైన కాపలా యేర్పాటు చేస్తాం. మీ కుటుంబానికి పోలీస్ రక్షణ యేర్పాటు చేస్తాం!" అన్నారు జస్టిస్.

"థాంక్యూ సర్!"

శాంతారాం నేరస్తులు వెళ్ళినవైపు చూచి పళ్ళు పట పట లాడించాడు.

ఇద్దరూ, జ్యూరీ సభ్యులూ, చూడవచ్చిన పౌరులూ హాలులోంచి కదిలారు.

## 2

అతను రిక్షాను వేగంగా తొక్కుతున్నాడు.

రోడ్డుమీద చీకటి. చుక్కల వెలుగు అస్పష్టంగా రోడ్డుమీద పడుతోంది.

"కైవ్స్ సిద్ధం చేయి!" అన్నాడు రిక్షా తొక్కు

తోన్న వ్యక్తి.

"కనెక్షన్స్ బిగించాను!" అన్నాడు రిక్షాలో వున్నతను.

ఇద్దరూ ముఖాలకు అడ్డంగా గుడ్డలు కట్టుకొన్నారు.

"జైలు గేటు దగ్గరకు వచ్చాం!" అన్నాడు రిక్షా వాడు.

రిక్షాలో చప్పుడు మొదలయింది.

సెంట్రల్ జైలు గేటులో సెంట్రీలు కాపలావున్నారు. చీకట్లో సిగరెట్స్ కాల్చుకుంటున్నారు.

మరుక్షణంలో రిక్షాలో నుండి బుస్‌మంటూ గాలి గేటువైపు ప్రయాణిస్తోంది.

సెంట్రీలు మౌనంగా రోడ్డుమీదకు జారిపోయారు.

రిక్షా జైలు గేటులోంచి లోపల ప్రవేశించింది. సెంట్రల్ జెయిల్ ప్రాంతమంతా తీయటి వాసన! సెంట్రీలూ, జైలు వుద్యోగులూ, కానిస్టేబుల్స్, ఒక రేమిటి? చివరకు ఖైదీలు కూడా స్పృహతప్పి పోతున్నారు. ఇద్దరూ రిక్షా దిగారు. క్రొవ్వొత్తుల కాంతిలో సెల్స్ భయంకరంగా వున్నాయి. ఇద్దరూ సెల్ నెంబర్లు చూసుకొంటూ నడుస్తోన్నారు.

ఇద్దరూ ఓ సెల్ ముందు ఆగారు. సెల్‌లో నలుగురు ఖైదీలు నేలమీద పడి నిద్రపోతున్నారు.

## 3

పబ్లిక్ ప్రాసిక్యూటర్ శాంతారాం బద్ధకంగా ఒత్తిగిల్లాడు. చెవులు గింగుర్లెత్తుతోన్నాయి. టెలిఫోన్ భయంకరంగా మ్రోగుతోంది. శాంతారాం చటుక్కున ముందుకు జరిగి రిసీవర్ అందుకొన్నాడు.

"శాంతారాం స్పీకింగ్ హియర్!" అన్నాడు పబ్లిక్

ప్రాసిక్యూటర్.

"ఛీఫ్ జస్టిస్‌ను మాట్లాడుతున్నాను" అవతలనుండి వినిపించింది.

శాంతారాం బద్ధకం దిగిపోయింది.

"చెప్పండి సర్!" అన్నాడు.

"అరగంటలో వస్తున్నాను. మీతో మాట్లాడే పని వుంది!"

"ఫోన్ నన్ను రమన్నారా సార్?"

"అక్కరలేదు. నిద్రాభంగం కలిగించాను. సారీ!" అవతల క్లిక్ మన్నది.

శాంతారాం మంచం దిగాడు.

ఇల్లు నిశ్శబ్దంగా వుంది. తన యిద్దరు పిల్లలూ, భార్య పేరంటానికి వెళ్ళారు. తన బావమరిది పార్వతీశం, అతడి కొడుకు రాంగోపాల్ సినిమాకు వెళ్ళారు. అందరూ కలసి రాత్రి యే ఒంటిగంట దాటాకో వస్తారు. తనకు రెండో ఆటకు వెళ్ళడంకానీ రాత్రి తొమ్మిది తర్వాత మేలుకుని వుండటం కానీ ఇష్టం వుండదు.

మెట్లు దిగి హాల్లోకి వచ్చాడు శాంతారాం. హాలులో జీరోవాట్ బల్బు వెలుగుతోంది.

సోఫాలో కూలబడ్డాడు శాంతారాం.

ఛీఫ్ జస్టిస్ తనతో మాట్లాడ రావడం విడ్డూరంగా వుంది.

ఆయనకూ తనకూ స్నేహం వుంది. ఆయన యే నాడూ తన యింటికి రాత్రివేళ మాట్లాడటానికి రాలేదు.

ఆయన ఎందుకోసం వస్తోన్నట్టు?

శాంతారాం ఆవులించి చిటికె వేశాడు. నిమిషాలు గడుస్తోన్నాయి.

పోర్టికోలో కారు ఆగింది.

శాంతారాం చటుక్కున సోఫాలోంచి లేచాడు. తలుపువైపు నడిచాడు. గడియ తీసి గుమ్మంలోకి నడిచాడు.

కారువైపు చూచి వులిక్కిపడ్డాడు.

కారులోంచి నలుగురు దిగారు. బుగ్గమీసాలూ, ఖైదీల దుస్తులూ, ఎర్రటి కళ్ళూ....

శాంతారాం గజగజ లాడాడు.

చటుక్కున తలుపు మూయబోయాడు.

అప్పటికే ఆలస్యమైపోయింది.

## 4

"సార్!"

తెరమీదనుండి రాంగోపాల్ తల త్రిప్పి చూశాడు.

గేట్ కీపర్ తన సీటువద్ద నిలబడి వున్నాడు.

"ఎవరు? యేం కావాలి?" అడిగాడు పార్వతీశం.

"ఎవరో పిలుస్తున్నారు సార్! గుమ్మం దగ్గర వున్నారు" అన్నాడు గేట్ కీపర్.

"ఎవరు పంపించారట?" అడిగాడు రాంగోపాల్.

"పబ్లిక్ ప్రాసిక్యూటర్ శాంతారాంగారు."

పార్వతీశం లేచాడు.

"ఇద్దరినీ రమ్మన్నార్సార్!"

రాంగోపాల్ కూడా లేచాడు. తండ్రీ కొడుకులు హాలులోంచి బయటకు నడిచారు.

గేటువద్ద ముసలతను నిలబడి వున్నాడు.

"తమరిని అర్జంటుగా శాంతారాం బాబుగారు రమ్మన్నారు" అన్నాడు ముసలతను కదులుతూ.

పార్వతీశం రాంగోపాల్ అతడి వెంట బయటకు నడిచారు. అతడు పోర్టికోలో ఆగివున్న కారు వద్దకు తీసుకు వెళ్ళాడు.

డోర్ తెరచి పట్టుకున్నాడు.

పార్వతీశం, అతడి వెనక రాంగోపాల్ కారులో కూర్చున్నారు. ముసలతను వాళ్ళ ప్రక్క కూర్చున్నాడు.

"పోనీయ్!" అరిచాడు ముసలతను.

అతడి గొంతులో దర్పం, కాఠిన్యం చోటు చేసుకున్నాయి. రాంగోపాల్ విడ్డూరంగా తన ప్రక్కకు చూశాడు.

"డ్రయివర్ పేరు రాజేంద్ర. నా పేరు గంగులు!" అన్నాడు ముసలతను.

పార్వతీశం కళ్ళు పెద్దవయాయి.

"జీవితఖైదు వేసిన గంగులా?"

"వేసిన.... కాదు .... వేయించుకున్న...." నవ్వాడు గంగులు. అతడి నవ్వు హృద్యంగా లేదు.

## 5

కాంతారాం కళ్ళు తెరిచాడు.

తలంతా దిమ్ముగా వుంది. జరిగిన విషయం గుర్తుకు తెచ్చుకోసాగాడు. పోర్టికోలో కారు ఆగింది. కారులోంచి నలుగురు దిగారు. తాను తలుపు మూయబోయాడు.

గంగులు చటుక్కున తనను సమీపించాడు. చెయ్యి పుచ్చుకుని ముందుకు లాగాడు. తను మెట్లమీదుగా జారిపడ్డాడు. తనను వాళ్ళు చుట్టుముట్టారు. లేపి కారులో కూర్చోబెట్టారు.

వాళ్ళలో యిద్దరు యింట్లోకి పరుగెత్తారు. ఇరవై

నిమిషాలపాటు యిల్లంతా గాలించారు. మొహాలు వ్రేలా డేసుకుని వచ్చారు.

తను తృప్తిగా చూశాడు. తనకు ఏమైనప్పటికీ ఫరవా లేదు. తనవాళ్ళకి యేమీ కాదు. వాళ్ళు యింట్లో వుండ కుండా వెళ్ళిపోవడం మంచిదే అయింది.

గంగులు తనవైపు చూశాడు. అతడి కళ్ళలో ఎర్రటి జీరలు కదులుతున్నాయి.

"నీ పెళ్ళాం పిల్లలు ఎక్కడికి వెళ్ళారు?" అడిగాడు గంగులు.

తను మాట్లాడలేదు.

యువకుడొకడు ముందుకు వచ్చాడు.

వాడి పేరు రాజేంద్ర అట! తరువాత తెలిసింది. వాడు తనని దవడమీద కొట్టాడు.

"నీ కూతురు లతకు కాబోయే మొగుడు రాంగోపాల్! ఎస్! అతడు యెక్కడ? అన్నట్టు మీ బావ పార్వతీశం యెక్కడ?" అడిగాడు రాజేంద్ర.

తనకి దవడ పళ్ళతో బాటు తలలో నరాలు అదిరాయి.

వీళ్ళు తన కుటుంబాన్ని కొంతకాలంగా పరిశీలిస్తున్నా రన్నమాట.

"మాట్లాడవేం?" అరిచాడు గంగులు.

శాంతారాం తెలియదని చెప్పాడు.

రాజేంద్ర తన ప్రక్కగా కూర్చున్నాడు. డొక్కలో కుమ్మాడు. తన జుత్తు పట్టుకొని ముందుకు వంచాడు. తన చెంపలు పళపళమన్నాయి. వాడి చేతుల్లో ఇనుప రేకు లున్నట్టు తోచింది తనకు. దంతాలు కదిలాయి. నోటికి వుప్పగా తగిలింది.

రాజేంద్ర తనను క్రిందకు పడగొట్టాడు. సీటుకూ సీటుకూ మధ్య వున్న యిరుకు స్థలంలో పడ్డాడు తాను.

తనమీద కాళ్ళు పెట్టి అదిమిపెట్టసాగాడు రాజేంద్ర.

తన మొహానికీ భుజాలకీ దెబ్బలు తగిలాయి. దుఃఖం, ఆవేశం, నిస్సహాయతా తనలో కొట్టుకొచ్చినట్టు కనిపిస్తోన్నాయి.

రాజేంద్ర కాళ్ళు మెడను క్రిందకు అదిమి పెడుతున్నాయి. తనకి వూపిరి అందడంలేదు.

"చెప్పు! మీ వాళ్ళు ఎక్కడికి వెళ్ళారు?" రాజేంద్ర తన రెండో కాలు ఎత్తాడు. వెన్నుమీద తన్నాడు. ముక్కులోంచి వెచ్చటి నెత్తురు కారుతోంది.

తను ఆ స్థితిలో యేం చెప్పాడో తనకే తెలియదు.

ఇప్పుడే తిరిగి కళ్ళు తెరవడం!

శాంతారాం చుట్టూ చూశాడు. విశాలమైన రాతి గోడలు. నేలమీద నాపరాళ్ళు పరిచివున్నాయి. వాటి మధ్య యేనాటిదో చెక్కసున్నం అతుకువేసి వుంది. ఒక వైపు ద్వారం వుంది. యే నాటిదో చెక్క తలుపు.

శాంతారాం నేల మీద నుండి లేచాడు. కళ్ళు సలుపుతోన్నాయి. మోచేతులూ మోకాళ్ళూ మొహమూ గాయాలయాయి.

మూలుగుతూ ద్వారంలోంచి నడిచాడు.

విశాలమయిన హాలూ, హాలులో పొడవుపాటి బల్లా, బల్లకి అటూ యిటూ కుర్చీలూ... అంతా యే నాటిదో ఫర్నిచర్. ఏదో పెద్ద కోటలోని భాగంలాగా వుంది. బల్లకి అటు ప్రక్క ఇనుప మెట్లు.

కోట మొత్తం ప్రశాంతంగా వుంది. పాతకాలంనాటి రాతి కోట.

'చిత్రం! కోట అంతటికీ ఎవరూ వున్నట్టు లేదు!' గొణుక్కున్నాడు శాంతారాం. తనను ఇక్కడకు ఎందుకు తీసుకొచ్చారో అర్థం కాలేదు.

ఇనుప మెట్లు యెక్కసాగాడు. నత్తగుల్ల ఆకారంలో సుడితిరిగి మెట్లు పై కప్పులోకి చొచ్చుకు వెళ్తున్నాయి.

కోట మొత్తం నాలుగు అంతస్తులు!

శాంతారాం ఓపికగా పైవరకూ మెట్లు ఎక్కాడు. మెట్లు నడవాలోకి అంతమయాయి. నడవాలో నడిచాడు. నడవా చివర పైకి మెట్లున్నాయి. మెట్ల చివర బురుజు కనిపిస్తోంది.

శాంతారాం బురుజు చేరుకొన్నాడు. క్రిందకు చూశాడు. క్రింద విశాలమయిన కోట భాగాలూ, ఆ భాగాలమీద పెరిగిన అల్లిబిల్లి తీగలూ, దూరంగా చిట్టడవీ, అడవి ప్రక్కగా చిన్న కాలువా కనిపిస్తున్నాయి.

శాంతారాం కళ్ళు త్రిప్పుకొన్నాడు. అటే చూస్తే కళ్ళు తిరిగి కింద రాతికట్టు భాగాలమీద పడే ప్రమాదం వుంది. శాంతారాం బురుజు అంచునే నడసాగాడు. మూడడుగుల వెడల్పు బాటలో నడచి నాలుగు బురుజులూ చుట్టివచ్చాడు.

తిరిగి మెట్లు దిగాడు. హాలు దాటాడు. ప్రక్కగదిలో చీకటిగా వుంది. శాంతారాం భయపడ్డాడు. చీకట్లోకి చూశాడు. పైకప్పును తాకే తలుపు లున్నాయి. తలుపుల పైన గోడ అర్ధ వృత్తాకారంగా వంగింది. తలుపులు పై కప్పును తాకుతోన్నాయి.

శాంతారాం తలుపులను సమీపించాడు.

తలుపులకు అడ్డంగా ఇనుప గడియ వుంది. తలుపులకు

వున్న బోల్టులో గడియ తాపడం చేసి వుంది.

శాంతారాంకు దుఃఖం పొర్లుకు వస్తోంది. వయసును మరిచాడు. వెక్కి వెక్కి యేడవసాగాడు.

యేడ్చి యేడ్చి పిచ్చి ఎత్తుతోంది.

బయటకు పోయే దారిలేదు.

ఎటుప్రక్క వెళ్ళినా రాతిగోడలు ఎదురవుతోన్నాయి. ఇక్కడ మూసిన తలుపు.

అతడికి కళ్ళు తిరుగుతున్నాయి. స్పృహతప్పి నేల మీద పడ్డాడు.

## 6

హెలికాప్టర్ బురుజుమీద ఆగింది.

ఒక సాయుధుడు హెలికాప్టర్‌లోంచి దిగాడు. రాంగోపాల్‌నీ, పార్వతీశంనూ హెలికాప్టర్‌లోంచి దింపాడు. వాళ్ళిద్దరు స్పృహలో లేరు. బురుజుమీద పడుకోబెట్టాడు. పెలట్ వాళ్ళ మొహంమీద పరే లాగా నీటి పిచికారీ కొట్టాడు.

సాయుధుడు చెయ్యి వూపాడు.

హెలికాప్టర్ గాలిలోకి లేచింది.

సాయుధుడు బురుజులోంచి మెట్లు దిగాడు.

రాంగోపాల్ అటూ యిటూ కదిలాడు. మెల్లగా కళ్ళు తెరిచాడు. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తోంది. ప్రక్కకు తిరిగాడు. తంద్రి తగిలాడు. పార్వతీశం కూడా అప్పటికి లేచాడు. కళ్ళు నలుపుకొంటున్నాడు.

రాంగోపాల్ లేచి నిలబడ్డాడు. పిట్టగోడవైపు కదిలాడు. కోట చాలా ఎత్తు కావడంతో కళ్ళు తిరుగుతోన్నాయి.

"మనం ఇక్కడికెలా వచ్చాము?" ఆశ్చర్యపోయాడు

రాంగోపాల్.

"ఇది యేదో పాత కోట అయివుంటుంది!" అన్నాడు పార్వతీశం.

"గోల్కొండ కాదు! గోల్కొండ చుట్టూ యిటు వంటి చిట్టడివి కానీ, చిన్న సైజు కాలువగానీ లేవు...." పరిశీలనగా చూసి అన్నాడు రాంగోపాల్.

"నిజమే! గోల్కొండ కోట కట్టిన రాతికట్టు వేరు. ఈ రాతికట్టు వేరు!" అన్నాడు పార్వతీశం.

"మనలను దుండగులు రాత్రివేళలో పట్టుకొన్నారు. ఇది పగటి సమయం! అంటే మనని పట్టుకొన్నప్పటినుండి యిప్పటివరకూ మనను ఎక్కడయినా బంధించి వుండాలి. లేదా ఇంత సేపూ మనం ప్రయాణంలో వుండివుంటాం! చాలా దూరం వచ్చివుంటాం."

"అక్కడ మెట్లు కనిపిస్తోన్నాయి. అటు వెళ్దాం."

తండ్రీ కొడుకులు కదిలారు. ఇనుప మెట్లు దిగారు. చివరి మెట్టుమీద వుండగానే హాలూ, హాలులో పొడవు పాటి బల్లా, బల్లకి అటూ యిటూ కుర్చీలూ కని పించాయి.

పొడవుపాటి బల్లమీద మణి, లత, రాజు పడుకుని వున్నారు.

పార్వతీశం అవతలి ప్రక్క చూశాడు. అక్కడ కాంతారాం స్పృహతప్పి పడివున్నాడు. అయితే దుండ గులు వీళ్ళను కూడా తమలాగే ఎత్తుకొచ్చారన్నమాట. వాళ్ళ ఆశ్చర్యానికి అంతులేదు.

ఇద్దరూ మొహాలు చూసుకున్నారు. నిర్లిప్తంగా బల్ల వద్దకు నడిచారు.

బల్లమీద మణీ, లతా, రాజూ కదులుతోన్నారు.

కాంతారాం కూడా లేచి కూర్చున్నాడు. అందరూ ఒకరి నొకరు చూసుకొని విస్తుపోయారు. దుఃఖించారు. ఓదార్చుకున్నారు.

అయిదుగురి మొహాల్లోనూ ప్రేతకళ!

ఎక్కడో గంట వినిపిస్తోంది. ఆరుగురూ మెల్లగా గంట మ్రోగుతోన్న గదిలోకి నడిచారు. ఆ గదిలో రెండు టేబుల్సూ, టేబుల్సుకి అటూ యిటూ, ఆరు కుర్చీలూ వున్నాయి. టేబుల్సుమీద వంటగిన్నెలూ, కంచాలూ, ఫోర్కులూ మంచినీళ్ళ కూజాలూ.

గదిలో వంటకాలు గుబాళిస్తోన్నాయి.

“అమ్మా! ఆకలి!” ఐదేళ్ళ రాజా ముందుకు పరుగెత్తాడు. కంచాల ముందు పేర్లు రాసిన కాగితం ముక్కలున్నాయి. ఆరుగురి పేర్లు!

## 7

“అన్నదాతలు ఎవరో కాని మనకు మంచాలు కూడా ఏర్పాటు చేశారు!” అన్నాడు కాంతారాం.

మిగతావాళ్ళు నవ్వడానికి వ్యర్థ ప్రయత్నం చేశారు. కాంతారాం మంచంమీద వాలాడు.

విశాలమయిన గది! కాంతారాం పడుకొన్న మంచం కాక, గదిలో నాలుగు మంచాలు! మంచానికీ మంచానికీ మధ్య దోమ తెరలు! గదిలో హరికేన్ లాంతరు వెలుగుతోంది.

రాజా, తల్లీ ఒక మంచంమీదా, లత ఒక మంచం మీదా, రాంగోపాల్, పార్వతీశం చెరో మంచంమీదా సర్దుకొన్నారు. గదికి ఒకవైపు విశాలమయిన ద్వారం వుంది. గోడలమీద వింత నీడలు సృష్టిస్తోంది లాంతరు.

ఆరుగురూ మాట్లాడటానికి ప్రయత్నించారు.

దుఃఖంతో ఆరుగురి కంఠాలూ పూడుకుపోయాయి. ఆరుగురికీ కడుపు నిండింది. నీడ దొరికింది. అయితే ఆ నీడ సర్పం పడగ నీడ!

గది గుమ్మం బయట చప్పుడయింది.

ఆరుగురూ వులిక్కిపడ్డారు. తమకి కనబడని వ్యక్తులు భోజనం పెట్టారు. మంచాలు యేర్పాటుచేశారు. అయినా ఆ వ్యక్తులు కంటపడతారంటే యేదో గుబులు! అంత వరకు తమకు ఆ కోటలో యెవరూ తారసపడలేదు.

తలుపు తెరుచుకొంది. గుమ్మంలో గంగులు ప్రత్యక్షమయాడు. అతడి చేతిలో పిస్తోలు మెరుస్తోంది.

"నిలబడండి!" పిస్తోలు గాలిలో ఆడించాడు.

ఆరుగురూ లబలబలాడుతూ లేచి నిలబడ్డారు.

"శాంతారాం! నువ్వు నాకూ నా ముఠాకూ చేసిన అన్యాయం మరపురానిది! మిమ్మల్ని యింత సుఖంగా వుంచడం అన్యాయం! అయినా నేను దయతో ప్రవర్తిస్తున్నాను. ఒప్పుకొంటావా?..." అడిగాడు గంగులు.

"మమ్మల్ని యెందుకు యెత్తుకువచ్చావు?" అడిగాడు శాంతారాం.

"నా నోటితో చెప్పించాలనా? నువ్వు నాకూ నా ముఠాకూ జీవిత ఖైదు వేయించావు. నా మాట ప్రకారం మమ్మల్ని విడిచిపెట్టవలసింది. సరిగా వాదించకుండా వుండవలసింది!"

"నువ్వు చేసింది తప్పుకాదా?"

"ఏమిటా తప్పు? చింతపల్లి జమీందారును చంపడమేనా? వాడు రాస్కెల్! నాకు యెలాంటి అపకారం చేశాడో నీకు నా ప్లీడర్ చెప్పాడు."

"అంత మాత్రాన.... అతడి కుటుంబాన్ని మట్టు పెడతావా?"

"నీకు చెముడా?" అరిచాడు గంగులు. రాంగోపాల్ మంచం ప్రక్కగా నడవబోయాడు.

"ఒరేయ్ అల్లుడూ! కదిలావంటే కుందేలు పిల్లను కాల్చినట్టు కాల్చి పారేస్తానొరేయ్!" మరల అరిచాడు గంగులు.

రాంగోపాల్ ఆగిపోయాడు.

"వాడు నా చెల్లెల్ని రేప్ చేస్తే చూస్తూ వూరుకోమంటావా?"

"కాని ఆ విషయం రుజువు కాలేదు."

"నీ గ్రుడ్డి కోర్టుకు చెవులు లేవు."

"హింసకు ప్రతిహింసే పరిష్కారం కాదు."

"నోరు మూయి. గాంధీ కబుర్లు చెప్పకొరేయ్! ఆ కబుర్లు చెప్పేవాళ్ళే గూండాలను పోషిస్తున్నారు."

"నువ్వు నీ ముఠా జైలు నుండి తప్పించుకొన్నారు. కోర్టు శిక్షించినా మీ నలుగురూ ఆ శిక్ష నుండి బయట పడ్డారు. మమ్మల్ని వదిలిపెట్టెయ్యి!"

"నువ్వు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా దుష్టపాత్రను నిర్వహించావు."

శాంతారాం భయంగా చూశాడు.

"అందుకే మిమ్మల్ని రోజు కొకరిగా చంపుతాను."

ఆరుగురి మొహాల్లో విపరీతమయిన భయాందోళనలు రేగాయి.

"గంగులూ! నా డ్యూటీ చేయడం తప్పా?"

"అబ్బే! కాదు! నా డూటీ నాదీ! ఈ రోజు నీ ముద్దులకొడుకు రాజు చస్తాడు."

మణి చటుక్కున రాజును గుండెలకు హత్తుకొంది. గంగులు భయంకరంగా నవ్వాడు.

"నీ రాజును యెవడూ రక్షించలేడు!" గంగులు పిస్తోలు ఎగరేశాడు.

లత, పార్వతీశం, రాంగోపాల్, శాంతారాం చుట్టూ గుమిగూడారు. మధ్యలో మణీ, రాజూ.

తుఫానుకి పణికే పిల్లను రెక్కల క్రిందకు దాచుకునే కోడిలాగా.

"పిచ్చి వెధవల్లారా! రాజును పిస్తోలుతో కాల్చను" గంగులు వెనక్కి తిరిగాడు. బయటకు నడిచాడు. అతడి వెనుక తలుపు మూసుకుంది.

"మనం ఈ రాత్రంతా కాపలా వుందాం! రాజుకి యే ఆపదా రాకుండా చూసుకొందాం!" అన్నాడు పార్వతీశం.

మణి యేడుస్తోంది.

## 8

ఎక్కడో పక్షులు కిలకిల లాడుతోన్నాయి.

మణి చటుక్కున కళ్ళు తెరచింది. గదిలో హరికేన్ లాంతరు వెలుగుతోంది. తలుపుకద్ద అడ్డంగా తన భర్తా, పార్వతీశం అన్నయ్యా పడుకొని వున్నారు. లత మంచానికి చేరగిలబడి జోగుతోంది.

తన ప్రక్కనే పడుకున్న రాజు నుదురు నిమిరింది. విద్యుత్ ఘాతం తగిలిన దానల్లే వులిక్కిపడింది.

రాజు నుదురు చల్లగా తగిలింది.

రాజు పెదిమలు తడి ఆరివున్నాయి. శరీరం లేత నీలం రంగుకు తిరిగి వుంది.

మణి కెవ్వున అరచింది.

గదిలో మిగతా నలుగురూ నిద్రలోంచి వులిక్కిపడి లేచారు. మణి యేడుస్తోంది. గుండెలు బాదుకుంటోంది. రాజామీద పడి పొర్లి పొర్లి యేడుస్తోంది. ఆ దృశ్యం చూసి నలుగురికీ గుండెలు ద్రవిస్తోన్నాయి.

రాజా ఎలా చనిపోయాడు?

శరీరం నీలంరంగుకు ఎలా మారింది?

ఆడా మగా లేకుండా అందరూ ఏడుస్తున్నారు. గంటకు పైగా సమయం బరువుగా గడిచింది.

రాంగోపాల్ ముందుగా తేరుకొన్నాడు.

చటుక్కున తలుపు లాగాడు. సులువుగా తెరుచుకుంది. బయటకు దూకబోయి ఆగాడు. గది బయట యిద్దరు దుండగులు నిలబడి వున్నారు. ఆ యిద్దరి చేతుల్లోనూ మిషన్ గన్స్ వున్నాయి. అవి తలుపువైపు గురిపెట్టి వున్నాయి.

"గంగులు ఎక్కడ?" అడిగాడు రాంగోపాల్.

సాయుధులలో ఒకడు ముందుకు వచ్చాడు.

"రాజేంద్ర!" అన్నాడు రాంగోపాల్.

"అవును నా తోడల్లుడూ! పార, గునపం కావాలా?"

"మీకు దయాదాక్షిణ్యాలు లేవా?"

"లేవు."

"ఛీ...."

రాజేంద్ర వికటంగా నవ్వి, "ఒక పావుగంటలో వాడి శవాన్ని పాతిపెట్టి రండిరా. ఈ రాత్రికే చావబోయే వంతు ఎవరిదో తెలుస్తుంది!" అన్నాడు.

రాంగోపాల్ భయంగా లోపలకు నడిచాడు.

అప్పటికి యేడ్చి యేడ్చి మణీ, లతా స్పృహతప్పిపోయారు.

శాంతారాం దుఃఖం దిగమింగుకున్నాడు.

పార్వతీశం లేచాడు. శవాన్ని భుజాన వేసుకున్నాడు. మౌనంగా బయటకు నడిచాడు.

రాంగోపాల్, శాంతారాం అతడిని అనుసరించారు.

వాళ్ళ వెనుక రాజేంద్ర బయలుదేరాడు. సాయుధుడు గది తలుపులు మూశాడు. అక్కడే కాపలా వుండిపోయాడు.

విశాలమయిన నడవా దాటి తోటలో ప్రవేశించాడు పార్వతీశం. తోట చుట్టూ ఎత్తయిన ప్రహారీ. ప్రహారీకో సింహద్వారం. సింహద్వారం దగ్గర నాలుగు వేట కుక్కలు.

గంగులు వేటకుక్కలకు మేత వేస్తున్నాడు.

అవి మాంసపు ముక్కల కోసం ఎగిరెగిరి పడుతోన్నాయి.

రాజేంద్ర తోట చివర చూపించాడు.

పార్వతీశం శవాన్ని అక్కడ దించుకున్నాడు.

గంగులు అక్కడకు వచ్చాడు.

"శాంతారాం! నీ అవివేకానికి చిన్నవాడు బలయ్యాడు. తెల్లవారితే నీ భార్య నీకు దక్కదు" పక పక నవ్వాడు గంగులు.

## 9

సాయంకాలం నాలుగు గంటలయింది. రాంగోపాల్ మెల్లగా గదిలోంచి బయటకు వచ్చాడు.

గుమ్మం దగ్గర సాయుధంగా వుండే రాజేంద్ర కానీ, రెండో వ్యక్తి కానీ లేరు. రాంగోపాల్ పిల్లిలాగా నడుచుకుంటూ హాలులోకి వెళ్ళాడు. అక్కడ నిర్మానుష్యంగా వుంది. కత్తులు ఆకారంలోని ఇనుప మెట్లు

ఎక్కాడు. పై నడవాలో ప్రవేశించాడు.

బురుజా దగ్గర అలికిడయింది.

సాయుధుడు బురుజా దాటి అవతలి నడవాలో ప్రవేశించాడు. అతడు మరల ఇటు రావడానికి మూడు బురుజులు చుట్టి రావాలి. అతడి డ్యూటీ బురుజులు నాలుగూ చుట్టి తిరిగిరావడం!

రాంగోపాల్ నిశ్వసించాడు. చప్పుడు కాకుండా పిట్టగోడ దగ్గరకు వెళ్ళాడు. దూరంగా చిట్టడవిలో కొద్దిపాటి కోలాహాలం వినిపిస్తోంది. ఏదో వేట బృందం కాబోలు! తుపాకీలు పేలాయి.

'కోటమీద నుండి దూకితే!' రాంగోపాల్ ముందుకు ఒంగాడు.

పిట్టగోడ క్రింద రకరకాల ఎత్తులలో క్రింద అంతస్తులున్నాయి. వాటి పిట్టగోడలు మాత్రం కొద్దిగా గాలిలోకి లేచివున్నాయి.

తాను దూకితే పిట్టగోడమీదకు దూకగలగాలి. ఇవతల గోడా, అవతల గాలీ. అడుగు వెడల్పు గోడమీద తాను యింత ఎత్తునుండి దూకి అనుకోగలడా?

నిలువుగా వున్న కోటగోడమీద పడితే సున్నంలోకి ఎముకలు మిగలవ్.

చిట్టడివిలో వున్న వేటబృందాన్ని ఆకర్షిస్తే? ఫలితం వుంటుందా? వుండదా?

రాంగోపాల్ నిశ్శబ్దంగా బురుజులోకి నడిచాడు. గోడ ప్రక్కగా నిక్కి నిలబడ్డాడు. చెవులు ఓరగా పెట్టి వినసాగాడు.

సాయుధుడు పిట్టగోడ వద్ద నడుస్తున్నాడు. బూట్ల శబ్దం లయగా వినిపిస్తోంది. రాను రాను శబ్దం దగ్గరవు

తోంది.

రాంగోపాల్ వూపిరి బిగబట్టాడు.

సాయుధుడు బురుజులో ప్రవేశించాడు.

రాంగోపాల్ ఎగిరి అతడి మెడను వాటేసుకున్నాడు. సాయుధుడు క్రింద పడ్డాడు. అతడితోబాటు రాంగోపాల్ క్రింద పడ్డాడు. మెషీన్‌గన్ తుళ్ళి అంత దూరంలో పడింది.

రాంగోపాల్ మెషిన్‌గన్ వైపు ప్రాకాడు. సాయుధుడు అతడిని బూటు కాలితో తన్నాడు. రాంగోపాల్ దొర్లి మెషీన్‌గన్ వైపు పడ్డాడు. చటుక్కున అందుకొన్నాడు గన్.

సాయుధుడు చేతులమీదుగా పిల్లిమొగ్గ వేశాడు. రాంగోపాల్ చేతిలోని మిషన్ గన్ యెగిరి బురుజు అవతల పడింది. సాయుధుడు పరుగెత్తి మిషన్ గన్ అందుకొన్నాడు.

రాంగోపాల్ చేసేదిలేక చేతులు ఎత్తాడు.

మెట్లు దిగి తన గదికి చేరుకొన్నాడు. రాజేంద్ర గుమ్మం దగ్గర నిలబడి వున్నాడు. అతడి చేతిలో మెషిన్ గన్ వుంది.

"ఫలవాలేదురా, తోడల్లుడూ! నీకు సాహసం వుంది" నవ్వాడు రాజేంద్ర.

రాంగోపాల్ తలుపు తోసుకొని లోపలకు నడిచాడు....

తండ్రీ, కాంతారాం, లతా, మణీ అతడివైపు చూస్తోన్నారు. అందరూ పదీ పదిహేను రోజులు లంఖణాలు చేసినట్టు కనిపిస్తున్నారు.

రాంగోపాల్ నిట్టూర్చాడు. ఈరాత్రి మణి అత్తయ్య

చచ్చిపోతుంది. రాజు విష ప్రయోగంతో చచ్చి పోయాడు. విషప్రయోగం ఎప్పుడు జరిగింది? ఎలా జరిగింది? కంచాలవద్ద పేర్లురాసిన కాగితంముక్కలు అందుకే వుంచారా!

"మణీ! నువ్వు కూడా విషంవల్లనే చనిపోతావు" అన్నాడు రాజేంద్ర లోపలకు వచ్చి.

అందరూ వులిక్కిపడ్డారు.

"వద్దు....వద్దు. మమ్మల్ని చంప వద్దు" లత గొల్లుమంది.

రాజేంద్ర చటుక్కున లత దగ్గరకు దూకాడు. ఆమెను భుజం పట్టుకొని తనమీదకు లాక్కొన్నాడు.

రాంగోపాల్ అడితమీదకు దూకబోయాడు.

రాజేంద్ర అతడికి ఆ అవకాశం ఇవ్వలేదు. లతను గుమ్మంలోంచే బయటకు తోశాడు. తనూ బయటకు దూకాడు. తలుపులు దగ్గరగా లాగాడు.

మణి సన్నగా యేడుస్తోంది.

రాజేంద్ర విసురుగా లతను నడిపించుకొంటూ ప్రక్కగదిలో వెళ్ళాడు. తలుపును బలంగా తన్ని మూశాడు. లతను మంచం మీదకు తోశాడు. లత మంచం మీద బోర్లాపడింది. కోపంతోనూ, నిస్సహాయతతోనూ లత వగురుస్తోంది.

రాజేంద్ర ఆమె పమిట పట్టుకు లాగాడు. లత మంచం మీద దొర్లుతోంది. రాజేంద్ర చేతిలోకి చీర వూడి వచ్చింది. లత కేవలం పావడలోనూ, బ్లవుజ్ లోనూ వుంది. లత గింజుకొంటోంది.

రాజేంద్ర మెషిన్ గన్ ప్రక్కన పెట్టి ఆమెమీదకు దూకాడు.

తలుపు తెరుచుకొంది. గంగులు ప్రత్యక్షమయాడు! అతడి కళ్ళల్లో ఎర్రటి జీరలు!

"రాజేంద్రా!" అరిచాడు గంగులు.

రాజేంద్ర ప్రక్కకు తిరిగిచూశాడు. లత శరీరంతో పెనుగులాడే చేతులు ఆగాయి. లత పెనుగులాడుతోంది.

"నిన్ను యిష్టపడని స్త్రీతో అనుభవం నరకం! చింత పల్లి జమీందారును నా చెల్లెలు యిష్టపడే వుంటే...." గంగులు గొంతు వణికింది. "చరిత్రే మరో రకంగా వుండేది. నిన్ను యిష్టపడని స్త్రీని బలవంతంగా అనుభవించావా, చింతపల్లి జమీందారులాగా...."

రాజేంద్ర అసమ్మతిపూర్వకంగా చూశాడు.

"ఈ చిలక నీ గుప్పెట్లోంచి పారిపోదు. ఈమె నిన్ను ఇష్టపడుతుంది. ఓపికపట్టు. మరో మూడు రోజులు."

## 10

మణి గిలగిల కొట్టుకొంటోంది. ఆమె శరీరంమీద వున్న దుప్పటి మడతలు పడుతోంది.

శాంతారాం భార్యను సమీపించాడు.

అప్పటకే పార్వతీశం, లత, రాంగోపాల్ మంచం చుట్టూ చేరారు. మణి నురుగులు క్రక్కుతోంది. శాంతారాం దుప్పటి తొలగించబోయాడు.

మణిలో చలనం ఆగిపోయింది.

శాంతారాం విసురుగా దుప్పటి లాగాడు. మణి కట్టుకొన్న చీరమీద నల్లత్రాచు ప్రాకుతోంది.

"అమ్మా!" అరచింది లత. అరుస్తూనే ఆమె స్పృహ తప్పిపోయింది. రాంగోపాల్ విసురుగా పామును తోక పట్టుకున్నాడు. కోపంతో గిరగిరా గాల్లో పామును

త్రిప్పి గోడకుకొట్టసాగాడు. ఎంత సేపు కొడుతోన్నాడో కాని పార్వతీశం అతడి భుజం తట్టాడు.

పాము శరీరం చిట్లి చీలికలయింది. గోడ నెత్తురుతో కండలతో ఎఱ్ఱబడింది.

భార్య శవంమీద శాంతారాం తలవాల్చాడు. చీకట్లో తడుముకొనేవాడిలాగా శవాన్ని తడుముతోన్నాడు. కళ్ళు వర్షిస్తున్నాయి. శవం కన్నీటితో తడుస్తోంది.

తలుపు తెరుచుకొంది. గంగులూ, రాజేంద్రా లోపలకు వచ్చారు.

“చూశావా శాంతారాం! కోర్టులో నా సాక్ష్యాలు ఎలా కొట్టిపారవేశావో, గుర్తొస్తోందా? ఇప్పుడు కూడా సాక్ష్యం దొరకని చావు!” నవ్వాడు గంగులు.

శాంతారాం విసురుగా లేచాడు. అతడి కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. గంగులుమీదకు దూకాడు. గంగులు అతడిని చీమను విసిరికొట్టినట్టు విసిరికొట్టాడు.

శాంతారాం గోడమీద పడ్డాడు. తిరిగి విసురుగా లేచాడు. గంగులు మెడ దొరకబుచ్చుకొన్నాడు. గంగులు విదిలించుకొన్నాడు. రెండు చేతులనూ బ్లేడుల్లాగా చేసుకొన్నాడు.

శాంతారాం మెడమీద రెండు కత్తులు పడినట్లు చేతులుపడ్డాయి. శాంతారాం కుప్పకూలిపోయాడు.

“పార్వతీశం! ఈ రాత్రికి నువ్వు కుక్కలకు ఆహారమవుతావు. హాలులో వున్న మెట్లు ఎక్కి పారిపో. అయిదునిమిషాల్తర్వాత కుక్కలు వెంట తరుముతాయి. వేటకుక్కలు!”

పార్వతీశం మొహంలో మృత్యుచ్ఛాయ!

“కంగారుపడక! నీ చేతికి పొడవుపాటి కత్తి ఇస్తాం!”

కంగులు వెనక్కి తిరిగాడు.

రాంగోపాల్ ఆలోచనలోపడ్డాడు. నరరూప రాక్షసుడు. కంగులు తమలో రాత్రికి ఒక్కొక్కరినీ చంపేస్తున్నాడు.

ఎటూ తమ అందరికీ చావు తప్పదు! తెగించాలి! ఎలా?

## 11

మెట్లవద్ద నిలబడ్డాడు కంగులు. అతడి చేతిలో వేట కుక్కల త్రాళ్ళున్నాయి. త్రాళ్ళ చివర వేటకుక్కలు వగురుస్తోయి.

ఇనుప మెట్ల పైభాగంలో పార్వతీశం నిలబడివున్నాడు. అతడి చేతిలో పొడవుపాటి కత్తి వుంది. కంగులు అక్కడి నుండి కనిపిస్తోన్నాడు. ఇవతలి ప్రక్కకు చూశాడు. కుక్కలకు అవతల రాజేంద్ర, రెండో సాయుధుడు నిలబడివున్నాడు. కంగులుకు వెనక భాగంలో లతా, రాంగోపాల్, శాంతారాం, భయంతో బిగుసుకుపోయి వున్నారు.

లత ఈ ఘోరం చూడలేనట్టు కళ్ళు మూసుకుంది.

శాంతారాం వణుకుతోన్నాడు. రాంగోపాల్ కళ్ళు ఎర్రబడి వున్నాయి. శాంతారాంను మెల్లగా తాకాడు. అతను మోచేత్తో గుచ్చాడు.

ముగ్గురూ గుప్పెళ్ళతో సాయుధలవైపు విసిరారు. గుప్పెళ్ళతో సిద్ధంగా వుంచుకొన్న మట్టి రాజేంద్రకూ, అతడి తోటి సాయుధుడికీ కళ్ళలో పడింది.

కంగులు కుక్కల త్రాళ్ళు వదలిపెట్టాడు. వాళ్ళవైపు చూశాడు.

పార్వతీశం చటుక్కున మెట్లమీదకు ఎగిరాడు. మరు

క్షణంలో అతడు గాలిలో వున్నాడు. నాలుగు కుక్కలూ గాలితో పోటీపడి పైకి పరుగెత్తుతున్నాయి. పార్వతీశం కిందకు ప్రవాహంలాగా చొచ్చుకు వస్తున్నాడు.

వేటకుక్కలూ అతడూ గాల్లోనే తప్పుకున్నారు.

పార్వతీశం నేరుగా గంగులుమీద పడ్డాడు. ఇద్దరూ నేలకు అతుక్కుపోయారు. ఇద్దరికీ తలలు పగిలాయి.

రాంగోపాల్ సాయుధులవైపు చూశాడు. వాళ్ళ చేతుల్లో వున్న మెషిన్ గన్స్ ఎగిరిపడ్డాయి.

రాజేంద్ర కళ్ళు మెరమెరలాడాయి. చీకట్లో తన్నే వాడికిలాగా ఎడాపెడా బూట్లకాళ్ళతో తన్నసాగాడు. రాంగోపాల్ కి తగలరానిచోట్ల దెబ్బలు తగిలాయి.

రెండో సాయుధుడు శాంతారాంను ఈడ్చిపెట్టి తన్నాడు.

నేలమీద గంగులు, పార్వతీశం తలలు పగిలిన నెత్తురూ, తెల్లటి మెదడూ ప్రాకుతున్నాయి.

వేటకుక్కలు వెనక్కి తిరిగాయి.

మరుక్షణంలో అవి ఆ ఇద్దరి శవాలను పీక్కుతింటున్నాయి.

శాంతారాం, లతా రాంగోపాల్ ప్రాకుతూ తమ గదిలోకి పారిపోయారు. తలుపు వేసుకున్నారు. రాం రాంగోపాల్ మూలుగుతున్నాడు. బయట మెషిన్ గన్స్ కర్కశంగా గర్జించాయి. వేటకుక్కలు మూలిగాయి.

లత మంచంమీద వాలిపోయింది.

## 12

శాంతారాం తోటలో పచార్లు చేస్తున్నాడు. రాజేంద్ర తనకి ఈ రాత్రికి గడువు పెట్టాడు. తాను తోటలోంచి పారిపోవాలి. అరగంట తర్వాత రాజేంద్ర

తన వెనక పడతాడు. అతడి చేతిలో మెషిన్‌గన్ వుంటుందట!

తను కోటదాటి చిట్టడవిలో ప్రవేశించాలి. కాలవ దాటాలి. దాటగలితే అతడు మెషిన్ గన్ పేల్చడు. లేకపోతే తన ప్రాణాలు మెషీన్‌గన్‌కి బలవుతాయి.

శాంతారాం గుండె పట్టుకున్నాడు.

గుండెల్లో నొప్పి వస్తోంది. తన కళ్ళముందే తన కొడుకూ, తన భార్యా కుక్క చావు చచ్చారు. తన బావమరది పార్వతీశం తన ప్రాణాలు త్యాగంచేసి గంగులును చంపాడు.

ఇపుడు చావబోయేది తను.

తన ప్రాణాలు పోతాయనేసరికి తన గుండెల్లో నొప్పి వస్తోంది. ప్రాణాలమీద తీపి అటువంటిదేమో! మొక్కలు కదిలాయి.

రాజేంద్ర మెషిన్‌గన్‌తో వచ్చాడు.

"శాంతారాం! సిద్ధమేనా?" అడిగాడు రాజేంద్ర.

శాంతారాం తడబడ్డాడు. మెలికలు తిరిగాడు. దబ్బున పడిపోయాడు. తలవాల్చాడు.

రాజేంద్ర చప్పున అతడిని సమీపించాడు.

'పిరికి వెధవ! గుండె ఆగి చచ్చాడు. నువ్వు గ్రుడ్డి కొట్టక వినబడని చెవివి!' తిట్టుకున్నాడు రాజేంద్ర.

చకచక కోటలోకి నడిచాడు.

పారా పలుగూ తీసుకున్నాడు. శవాన్ని సమీపించాడు.

నిశ్శబ్దంలో నేలను త్రవ్వుతోన్న శబ్దం పరచుకుంటోంది.

గంగులు చచ్చిపోయాడు. తనుతోబాటు ఖైదులోంచి

పారిపోయిన నాలుగో వ్యక్తి రేపు ఉదయానికి హెలి కాప్టర్‌తో ఇక్కడకు వస్తాడు. గంగులు స్థానంలో వాళ్ళకు నాయకుడు రాజేంద్ర!

రాజేంద్ర హుషారుగా తవ్వుతోన్నాడు.

తాను రేపటినుండీ దొంగలనాయకుడు. తమ ముఠాకు బాస్! ఈ రాత్రికి రాంగోపాల్‌ను కూడా చంపేసి, లతను తీసుకొని తను వాళ్ళతో వెళ్ళిపోతాడు.

## 13

"డాడీ వెళ్ళి రెండు గంటలయింది!" ఏడుస్తోంది లత.

ఆమె తలను తన గుండెలకు హత్తుకున్నాడు రాంగోపాల్.

"డాడి చిట్టడవి కాలవ దాటి వుంటారా?"

"దాటి వుంటారనే ఆశిద్దాం!" లతను మంచంమీద పడుకోబెట్టాడు రాంగోపాల్.

"బావా!" అతడిని వాటేసుకుంది లత.

ఆమె చెక్కిళ్ళు తుడిచాడు రాంగోపాల్.

"మనను కూడా చంపేస్తారంటావా?"

రాంగోపాల్ మాట్లాడలేదు. ఆలోచనలతో పిచ్చెత్తి పోతోంది. తన ప్రాణాలూ లత ప్రాణాలూ దుండు గులకు గడ్డిపరకలు! అతడు ఆమె మెడను నిమరసాగాడు. మెడమీద పల్చటి నరం తగులుతోంది. సున్నితంగా రాస్తోన్నాడు రాంగోపాల్. నరం మెల్లగా వుబ్బు తోంది.

లతకు కళ్ళు మూసుకుపోతోన్నాయి.

రాంగోపాల్ నిట్టూర్చాడు. లత నిద్రపోవాలి! ప్రస్తుత పరిస్థితిలో ఆమె మాట్లాడకూడదు. భవిష్యత్తు

మీద ఏ కాస్తో ఆశ మిగిలితే అది కాస్తా సంఘ ప్రేలా పనలో పోతోంది.

రాంగోపాల్ కి ఎప్పుడో నిద్రపట్టింది.

లత మెల్లగా కళ్ళు తెరచింది. తన మెడమీది నరాన్ని తాకి బావ తనని నిద్రపుచ్చాలని చూశాడు. తను వాగుతోంది! అందుకే బావ నరాన్ని రాస్తూ వచ్చాడు. తను గమనించి నిద్ర నటించింది.

రాంగోపాల్ నిశ్చలంగా ఊపిరి పీల్చుతున్నాడు.

లత మంచం దిగింది. చప్పుడు చేయకుండా తలుపు వద్దకు నడిచింది. తలుపు తెరచింది. గది బయట ఎవరూ లేరు. మంచంవద్దకు నడిచింది. తలగడక్రింద చెయ్యి పెట్టింది. తీసి పమిటచాటున దాచుకుంది. తృప్తిగా చూసింది. బయటకు నడిచింది. తలుపు దగ్గరగా లాగింది. రాజేంద్ర గదిముందు ఆగింది.

చటుక్కున తలుపు తెరచుకుంది.

రాజేంద్ర నవ్వుతూ చూశాడు.

"నీ అంతట నువ్వే వస్తావని తెలుసు!" ఆమెను చేయి పుచ్చుకు లాగాడు.

లత నవ్వుతోంది. ఆమె కళ్ళు మెరుస్తోన్నాయి. అతడి మెడచుట్టూ చేతులు వేసింది.

రాజేంద్ర ఆమెను లోపలకు నడిపించాడు.

"కాని....నిన్ను వెతకాలి! పగపట్టిన పడుచువి!"

లత నవ్వుతోంది. పమిట తీసింది. పమిటను చేతో నే పట్టుకొని చీర పొరలు విప్పుతోంది.

రాజేంద్ర ఆమెను వాటేసుకున్నాడు. కళ్ళు చెదర గొట్టే యవ్వనం ఆమెది!

ఆమెను ముద్దులతో ముంచెత్తుతోన్నాడు.

లత పమిట చాటునుండి చెయ్యి ఒత్తిగించుకుంది. మణికట్టుతో అతడి నడుము తడిమింది. చివ్వున చెయ్యి తిప్పింది. బలంగా డొక్కలో గుచ్చింది. చెయ్యి ఎత్తుతోంది. గుచ్చుతోంది. ఆమె చేతులకు పిచ్చి బలం వస్తోంది. రాజేంద్ర బాధతో అరుస్తూ గిరికీలు కొడుతోన్నాడు.

లత అతడిని అందిన చోటనల్లా పొడుస్తోంది.
ఆమె చేతిలోని అద్దం ముక్క లక్క పూసినట్టుగా వుంది.
ఆమె బట్టలనిండా రక్తం.

లత అతడిని కాళ్ళతో తన్నింది. క్రిందపడ్డాడు. అరుస్తోనే గోడవద్దకు ప్రాకాడు. మెషిన్‌గన్ అందుకోబోయాడు. లత కళ్ళు మూసుకుంది.

తనని రాజేంద్ర చంపేస్తాడు. వాడూ చస్తాడు.

అయితే ఏం? తన బావ అయినా బతుకుతాడు.

రాజేంద్ర మెషీన్‌గన్ అందుకున్నాడు.

తలుపు తెరచుకుంది. రాంగోపాల్ పరుగెత్తుకు వచ్చాడు. వస్తూనే రాజేంద్రను చూశాడు. మెషీన్‌గన్ ఎగిరేలా తన్నాడు. రాజేంద్ర తేరుకోవడానికి అవకాశం ఇవ్వలేదు. జుత్తుపట్టుకున్నాడు. గోడకు అతడి తలను అదిమిపెట్టాడు. గుండెలమీద బలంగా తన్నాడు.

రాజేంద్ర నెత్తురు కక్కాడు. ఉండలు చుట్టుకుని పడిపోయాడు. అతడి మెడమీద కాలుంచి నిలబడ్డాడు రాంగోపాల్.

“లతా!....నీకు .... ప్రమాదం ....” రాంగోపాల్ వగర్చాడు.

“నాకు ఏమీ కాలేదు బావా!”

“నిద్రలో ఇటు తిరిగాను. నువ్వు నాకు తగల

లేదు. మెలకువ వచ్చింది. గదిలోంచి బయటకు వచ్చాను. ఈ గదిలో మూలుగు వినిపిస్తోంది. అంతే! రాజేంద్ర కోసం నా కళ్ళు వెతికాయి."

"మన అంచనా సరైనదయితే కోటలో మరొక సాయుధుడున్నాడు. వాడు కోట పై భాగంలో పిట్ట గోడ దగ్గర వుంటాడు."

ఇద్దరూ కళ్ళు కలిపారు. మెషీన్‌గన్ అందుకున్నాడు రాంగోపాల్.

రాజేంద్ర నాడిపట్టుకు చూసి బయటకు నడిచాడు రాంగోపాల్. ఇద్దరూ ఇనుప మెట్లు ఎక్కారు. పిట్టగోడ వైపు కదిలింది లత.

"ఆగు!" అన్నాడు సాయుధుడు. బురుజు చాటు నుండి పిట్టగోడవద్దకు వచ్చాడు. లత నిలబడిపోయింది.

రాంగోపాల్ చేతిలోని మెషీన్‌గన్ నిప్పులు కక్కింది.

సాయుధుడు కూలిపోయాడు.

ఆకాశంలో హెలికాప్టర్ వస్తోన్న చప్పుడయింది. లతా, రాంగోపాల్ కలసి సాయుధుడి శవాన్ని సాయంపట్టారు. బురుజు చాటున దాచారు.

హెలికాప్టర్ బురుజుమీద ఆగింది.

పైలెట్ సీట్లోంచి దిగబోయాడు.

"ఆగు!" అరిచాడు రాంగోపాల్, మెషిన్‌గన్ గురి పెడుతూ.

పైలెట్ చేతులెత్తి నిలబడ్డాడు. రాంగోపాల్, లత హెలికాప్టర్‌లో కూర్చున్నారు.

"హెలికాప్టర్ నడుపు. హైదరాబాద్ నగరం వైపు!" ఆదేశించాడు రాంగోపాల్.

122

పైలట్ తన సీటులో కూర్చున్నాడు.

హెలికాప్టర్ గాల్లోకి లేచింది.

కాలంతో తనకి సంబంధం లేనట్టు పాతకోట నిర్లిప్తంగా చూస్తోంది.

—:ఐ పో యిం ది:—